వంతెనల నిర్మాణం ఎప్పుడు?

- వాగుల ఉధృతికి తెగిపోయిన కల్వర్టులు
- నత్తనడకన కొనసాగుతున్న పనులు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు


వాగును దాటేందుకు ప్రయత్నిస్తున్న ప్రయాణికులు (ఫైల్)


పిల్లర్ గుంతలకే పరిమితమైన ఆర్.గార్లపాడు పెద్దవాగు

ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ నియోజకవర్గంలోని పలు వాగులపై వంతెనలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ఆరంభమైతే చాలు వాగులు ఉప్పొంగి పారడంతో పక్క గ్రామాలకు కూడా వెళ్లలేని పరిస్థితి కొనసాగుతూనే ఉంది. అధిక వర్షాల వల్ల వాగులో నీటి ఉధృతి ఎక్కువైతే ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే దాటే రోజులు ఇంకా మారలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల వద్ద వాగులపై అవసరమైన చోట వంతెలనలను ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

● ఇటిక్యాల మండలంలో ఆర్.గార్లపాడు నుంచి ఎర్రవల్లి వెళ్లే దారిలో పెద్దవాగు వర్షాకాలం ప్రారంభమైతే చాలు రోజుల తరబడి ఉధృతంగా ప్రవహిస్తుంది. బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● సాసనూలు నుంచి షేకుపల్లి, షేకుపల్లి నుంచి ఎర్రవల్లి, ఇటిక్యాల నుంచి చాగాపురం, ఉదండాపురం నుంచి ఎస్సీ కాలనీ, ఉదండాపురం నుంచి సాతర్లకు వెళ్లే దారిలో ఉన్న వాగులకు వంతెనలు లేవు.

● మానవపాడు మండలంలో అమరవాయి నుంచి మానవపాడు, చెన్నిపాడు నుంచి పెద్ద పోతులపాడు, మానవపాడు నుంచి చెన్నిపాడుకు వెళ్లే దారిలో ఉన్న పలు వాగులు అధిక వర్షాల కారణంగా ఉప్పొంగుతూ రోజుల తరబడి పారుతాయి. దీనివల్ల ఆయా గ్రామా ప్రజలు ప్రతి వర్షాకాలంలో ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ముప్పు తిప్పలు పడాల్సి వస్తుంది.

● ఉండవెల్లి మండలంలో పుల్లూరు నుంచి కలుగోట్లకు వెళ్లే దారిలో ఉన్న వాగు వర్షం పడితే చాలు ఉధృతంగా ప్రవహిస్తుంది. గతంలో వాగులో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కాగా కొంత కాలం క్రితం వాగు పారడంతో కారు ప్రమాదంలో గర్భిణి మృతి చెందింది. దీంతో పాటు ఉండవెల్లి నుంచి చిన్న ఆముదాలపాడు, ప్రాగటూరు నుంచి మారమునగాల, భైరాపురం నుంచి బస్వాపురం వెళ్లే దారిలో వాగులు వర్షాలతో పొంగి పొర్లుతుంటాయి.

● అలంపూర్ మండలంలో సుల్తానాపురం నుంచి జిల్లెలపాడుకు వెళ్లే దారిలో ఉన్న వాగు ప్రతి వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో తెలంగాణలోని మూడు గ్రామాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

● రాజోలి మండలంలో తుమ్మిళ్ల నుంచి మాన్‌దొడ్డి, అశోక్‌నగర్ క్యాంపు నుంచి తుమ్మిళ్లకు వెళ్లే దారిలో ఉన్న వాగులు వర్షాకాలం ప్రారంభమైతే రోజుల తరబడి ఉధృతంగా ప్రవహిస్తాయి. ప్రజలు అత్యవసర పరిస్థితులలో అధికంగా ప్రవహించే వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతారు.

● వడ్డేపల్లి మండలంలో రామాపురం నుంచి వల్లూరు, జూలకల్ నుంచి జూలకల్ స్టేజి, కొంకల నుంచి వడ్డేపల్లి వెళ్లే గ్రామాల మధ్యలో ఉన్న వాగులపై ఎలాంటి వంతెనలు లేవు.

● అయిజ మండలంలో ఎక్లాస్‌పురం నుంచి అయిజకు వెళ్లే దారిలో ఉన్న వాగు పొగిపొర్లితే ఎక్లాస్‌పురం, దేవనబండ గ్రామాలకు రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల సమీపంలో ఉధృతంగా ప్రవహించే వాగులపై త్వరితగతిన వంతెనలను నిర్మించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెనలు నిర్మించాలి..



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు పలు వాగులపై వంతెనలు లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ముఖ్యంగా గ్రామం నుంచి ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లే దారిలో నాలుగు వాగులు ఉండటం వల్ల పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు, వాహనదారులకు రాకపోకలకు అసౌకర్యంగా మారింది.

– లక్ష్మన్న, సాసనూలు, ఇటిక్యాల

నత్తనడకన పనులు..



మా ఊరి వద్ద ఉన్న పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి 4ఏళ్లు అయ్యింది. పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇప్పటికీ పూర్తి కాలేదు. పోయినసారి వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పూర్తిగా వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ఉసేన్, ఆర్.గార్లపాడు

ఉన్నతాధికారులకు విన్నవించాం..

గార్లపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి పిల్లర్ గుంతలను తీశాక వర్షాలు అధికంగా కురవడంతో నీరు నిలిచి పనులు పూర్తిగా ఆగిపోయాయి. పిల్లర్ గుంతలలో పూర్తిగా గుండ్లు ఉండటంతో బ్లాస్టింగ్ చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. జూరాల కాల్వ నుంచి నీరు వాగులోకి రావడంతో పనులు చేయడానికి ఇబ్బందులు తప్పడంలేదు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజల డిమాండ్ మేరకు అధికంగా పొంగిపొర్లే వాగులపై వంతెనలను నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. వారి నుంచి అనుమతులు రాగానే టెండర్లు వేసి పనులను ప్రారంభిస్తాం.

– మహేష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, అలంపూర్

క్లుప్తంగా

ఆదిశిలాక్షేత్రంలో భక్తుల పూజలు



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప , శేషంపల్లి శివసీతారామ స్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

తిరుమలలో భజన కీర్తనలు



అయిజ: మండలంలోని సంకాపురానికి చెందిన విజయరాయ భజన మండలి సభ్యులు శనివారం తిరుమలలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సంకీర్తనల కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కీర్తనలు ఆలపించారు. టీటీడీ కమిటీ వారు సభ్యులను శాలువలతో సన్మానించి స్వామి వారి దర్శనం చేయించారు. భజన కీర్తనలు ఆలపించిన వారిలో తిమ్మప్ప, విజయరాయ, వెంకేష్, ఉరుకుందు, రామలింగం, నరసింహులు, బజారి, నరసింహాచారి, నరసింహారెడ్డి, రాముడు, శీను, కృష్ణ, ఈశ్వరన్న ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

గద్వాల అర్బన్: ఈనెల 16,17,18వ తేదీల్లో ఏపీలోని తిరుపతిలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గంజిపేటలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఏర్పాటు



మానవపాడు: మండల కేంద్రంలో శనివారం ఫొటో, వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ సెక్రటరీగా నరసింహయ్యశెట్టి, నియోజకవర్గ అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా మధు, ప్రవీణ్‌కుమారులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అదేవిధంగా ఇటిక్యాల, మానవపాడు, వడ్డేపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సభ్యులను ఎనుకున్నారు. కార్యక్రమంలో ఖయ్యూం, ఓబులేష్, పరమేష్, రామాంజనేయులు, రాజేష్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కేటీదొడ్డి: మండలంలో ఆదివారం ఉదయం 8:30 నుంచి 12:30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు ప్రకటనలో తెలిపారు. నందిన్నె, మల్లాపురం, ఉమిత్యాల ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

సైబర్‌నేరాలపై అవగాహన అవసరం

మానవపాడు: సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సంతోష్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రజలకు కళాజాతా ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లను స్పందించకూడదని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు పోలీస్‌లను సంప్రదించాలని సూచించారు. బాలికలు ర్యాగింగ్‌కు పాల్పడితే షీటీం సభ్యులకు సమాచారం అందించాలన్నారు.

సభ్యత్వ నమోదు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు శనివారం చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ తెలుగుదేశం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో గజేంద్రగౌడ్, సూర్యకాంతరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత


పౌష్టికాహారం అందజేస్తున్న వైద్య సిబ్బంది

గద్వాల క్రైం: క్షయ వ్యాధిగ్రస్తులకు శనివారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడు శ్యామ్ పౌష్టికాహారం పంపిణీ చేశారు. మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలు సరిపడే పౌష్టికహారంను సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం ఇవ్వడం సంతోషమన్నారు. కార్యక్రమంలో అశోక్, దేవేంద్ర, శ్రీనివాసులు, నాగరాజు, నాగేష్, మురళీ, శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

17న కళాకారుల ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న మండలి సభ్యులు

అలంపూర్: ప్రజా నాట్య మండలి కళాకారుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు సభ్యులు అలీ అక్బర్, ఆశన్న తెలిపారు. శనివారం వారు అలంపూర్ చౌరస్తాలో విలేకరులతో మాట్లాడారు. గద్వాలలోని టీఎన్‌జీవో భవనంలో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నర్సింహ హాజరవుతున్నారని తెలిపారు. మండలి చేసే ప్రతి కార్యక్రమం, పాడే పాట, రాసే గేయం సమాజ చైతన్యం కోసం, ప్రజల ప్రగతి కోసమేనన్నారు. కార్యక్రమానికి కళాకారులు పెద్ద ఎత్తున హాజరు కావాలిని పిలుపునిచ్చారు.

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన


కేటీదొడ్డిలో బ్రిడ్జి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

కేటీదొడ్డి/ధరూరు: గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే వాగు బ్రిడ్జి నిర్మాణం సాధ్యం కాలేదని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాతపాలెం నుంచి నీలహళ్లి వెళ్తున్న వాగు వద్ద రూ.3 కోట్ల వ్యయంతో కొత్త బ్రిడ్జి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఈ ప్రాంతం నుంచి ప్రజలు కర్ణాటకకు వెళ్లడానికి సులభంగా ఉంటుందని, అలాగే మూడు నెలల్లో వర్షాకాలం రాబోతుందని, అందుకని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు నజూమున్నీసాబేగం, మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, పద్మమ్మ, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, సుదర్శన్, ఉరుకుందు, హనుమంతు, సూర్యప్రకాష్, ఆంజనేయులు, నాయకులు చక్రధర్, వెంకన్‌గౌడు, గోపి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మంగంపేటలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత పేదల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వాటిని పార్టీలకతీతంగా అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రభుత్వం అంతకు ముందు సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ రామకృష్ణను ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని అభినందిచారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న పాల్గొన్నారు.

పండగలు భిన్న సంస్కృతులను ఐక్యంచేసే వేదికలు

గద్వాల: ప్రపంచ మానవాళిని, భిన్న సంస్కృతులను ఐక్యం చేసే వేదికలు పండగలు అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. శనివారం రాత్రి 17వ వార్డు పరిధిలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ 2వ రైల్వేగేట్ వద్ద ఉన్న ఫాతిమా మసీదులో బీజేపీ కౌన్సిలర్ త్యాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆమె మాజరయ్యారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గద్వాల సర్వమత సమైక్యతకు ఆదర్శంగా నిలిచిందన్నారు.

శాంతినగర్: రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు శాంతినగర్‌కు చెందిన ఆల్–మదద్ యూత్ సభ్యులు శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మదీన మసీద్‌లో 400 మందికి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలు సామూహికంగా నమాజ్ చేశారు. అనంతరం సర్వమానవాళి సుఖశాంతులతో ఉండాలని దువా చేశారు. కార్యక్రమంలో ఆల్–మదీన యూత్ సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, మాలిక్, యూసుఫ్, భాష, మోహిన్, రహీం, అలీ, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్డు పంపిణీ



మానవపాడు: సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ జన్మదినం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జై సడిగడ్డ యువత సభ్యులు మధు, తిమ్మప్ప, దాదాభాషా, రహీం, రాముడు ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్డు, ఫ్రూట్ జ్యూస్‌లను పంపిణీ చేశారు.

ప్రతి ఆడపడుచుకి పెద్దన్న సీఎం కేసీఆర్

రాజోళి: ప్రతి ఆడపడుచుకి సీఎం కేసీఆరే పెద్దన్న అని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ 113 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడపిల్లకు వివాహం చేయాలంటే భయపడే తల్లిదండ్రులు, నేడు గుండె ధైర్యంతో చేస్తున్నారని, సీఎం కేసీఆర్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని, ఈ కానుకతో ఆడపడుచుల కుటుంబాల్లో ఊరట లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సుగుణమ్మ, వైస్ ఎంపీపీ రేణుక, తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, ఎంపీడీఓ గోవిందురావు, ఉప సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఇవ్వాలని వినతి

చేనేత కార్మికులకు ముద్ర యోజన ద్వారా అందిన రుణాల్లో మరి కొందరు కార్మికులకు సబ్సిడీ రాలేదని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందచేశారు. ముద్ర యోజన రుణాలకు 630 దరఖాస్తులు బ్యాంకు అధికారులకు ఇవ్వగా, 500 మందికి రుణాలు అందాయని, 370 మందికి మాత్రమే రూ.10వేల సబ్సిడీ అందిందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, వీరేష్, రఫి, పుల్లయ్య, హనీఫ్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు కొండంత భరోసా

శాంతినగర్: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొండంత భరోసాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. వడ్డేపల్లి తహసీల్దార్ జయరాములు అధ్యక్షతన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ స్థానిక ఐకేపీ భవనంలో శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన 89 మందికి రూ.89,10,324 విలువగల చెక్కులను అందజేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ రజిత, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, వైస్ చైర్‌పర్సన్ సుజాత, కౌన్సిలర్ రవి, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ లత, శ్రీనివాస్‌గౌడ్, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైరవీకారులను నమ్మొద్దు

అయిజ: కొంతమంది పైరవీకారులు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఎరవేసి డబ్బు అడుగుతారని, ఎవరికి పైసా ఇవ్వరాదని, నేరుగా తన దగ్గరకు రావాలని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 173 మంది లబ్ధిదారులకు అందజేశారు. నాకు మంత్రి తెలుసు, ఎమ్మెల్యే తెలుసు వారి ద్వారా మీకు లబ్ధి చేకూరేలా చేస్తామని పైరవీకారులు నమ్మబలికి ప్రజలనుంచి డబ్బు తీసుకుంటున్నారని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

దళితుల ఓట్ల కోసమే విగ్రహ ఏర్పాటు


మాట్లాడుతున్న మాదన్న

అయిజ: ముఖ్యమంత్రి కేసీఆర్ 9ఏళ్లలో అంబేడ్కర్‌కు నివాళి అర్పించలేదని, దళితుల ఓట్లకోసం ఇప్పుడు విగ్రహాన్ని ఏర్పాటు చేశారని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మాదన్న ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ విగ్రహాన్ని ఎన్నికల కోసమే ఏర్పాటు చేశారే తప్పా, అంబేడ్కర్ మీద అభిమానంతో కాదన్నారు. గౌరవం ఉండి ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని అవమానపరిచి ఉండేవారు కాదన్నారు. దళితులు ముఖ్యమంత్రి మాటలు నమ్మరాదని సూచించారు. దళితులకు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇల్లు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, దళితబంధు ఇవ్వకుండానే ఓట్లకోసం వేషాలు మారుస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో శేఖర్, గోపాలకృష్ణ, ఆంజనేయులు, కృష్ణ, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బూత్‌ను పటిష్టం చేసేందుకు స్పెషల్ డ్రైవ్



రాజోళి: ప్రతి బూత్‌ను క్షేత్ర స్థాయిలో పటిష్టం చేసేందుకు ఈ నెల 17న స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని భ్రమరాంబ ఆదివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జులు, మండల అధ్యక్షులు, పదాధికారుల సమావేశం నిర్వహించారు. 17వ తేదీన ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జిల్లాలోని 592 పోలింగ్ బూత్‌లకు వెళ్లి, వాటి పరిధిలో 31 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని, 7820078200 నంబర్ మిస్డ్ కాల్ ఇచ్చి, పార్టీకి సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, రాజగోపాల్, బుడ్డన్న, ఆంనేయులు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన కార్యదర్శులు


మానవపాడులో ఎంపీఓకు సమ్మె నోటీస్ అందిస్తున్న కార్యదర్శులు

మానవపాడు: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీఓ ఆంజనేయరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణలకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, నరేందర్, అశోక్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 28 నుంచి సమ్మెకు దిగుతున్నామని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రవిగౌడు, మహేష్, అశోక్, ధనుంజయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని 3, 4వ వార్డులో పారిశుద్ధ్యం నిర్వహణపై శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, కమిషనర్ ఆదిశేషులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వార్డుల్లో తిరుగుతూ మురుగు కాల్వలు, రహదారులు శుభ్రం చేయడంతో పాటు పలు పారిశుద్ధ్యం కార్యక్రమాలపై ప్రజలకు, సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు పార్వతి, సువర్ణ, అశ్విని, ఏఈ రమేష్‌నాయుడు, మేనేజర్ గణేష్‌బాబు, వార్డు స్పెషల్ అధికారులు గంగన్న, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గట్టు: మండలంలోని ఇందువాసి గ్రామశివారులో శనివారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్ తాయప్ప, యజమాని పోతురాజు, నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఓటర్ నమోదుపై దృష్టి సారించండి

అమరచింత: ఓటర్ నమోదుపై బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు కార్డుకు ఆధార్ కార్డు నంబర్ అనుసంధానం చేయాలన్నారు. ఫారం 6 కొత్త ఓటరు నమోదు, ఫారం 7 తొలగింపుల కోసం, ఫారం 8 మార్పులు చేర్పులు తదితర అంశాలపై బీఎల్‌ఓలకు యాప్‌లో ఎలా నమోదు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్‌ఐలు జయమ్మ, నర్సింహులు, జూనియర్ అసిస్టెంట్ నాగేంద్ర ప్రసాద్, రఘు పాల్గొన్నారు.

మదనాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓలతో తహసీల్దార్ నరేందర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఆధార్ కార్డు వివరాలతో నమోదు చేయాలని ఆదేశించారు.